సాక్షి మంచిర్యాల

గురువారం ￭ 28 ￭ సెప్టెంబర్ ￭ 2023

వినాయకా.. వీడ్కోలిక

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వినాయక నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు మంగళహారతులతో వీడ్కోలు పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య యువత నృత్యంతో అలరించారు.

- వివరాలు 9లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పొగమంచు కమ్ముకుని ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బలహీన వర్గాల ఆశాజ్యోతి బాపూజీ

- కలెక్టర్ బదావత్ సంతోష్



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్‌లు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1969లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన మంత్రి పదవి త్యాగం చేశారని, 2009–12 వరకు సాగిన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో బాపూజీ కాంస్య విగ్రహం, ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ సాధన కమిటీ, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, అధ్యక్షుడు గాదాసు బాపు, వివిధ వెనుకబడిన తరగతుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ డ్రైవర్లకు వేతనాలు విడుదల

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న స్వచ్ఛ డ్రైవర్లకు ఎట్టకేలకు వేతనాలు విడుదలయ్యాయి. 18నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతుండగా 'వేతనం లేని 'స్వచ్ఛ' డ్రైవర్లు' శీర్షికన 'సాక్షి'లో జూలై 26న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు డ్రైవర్లకు రావాల్సిన వేతనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. బుధవారం డ్రైవర్లకు చెల్లించాల్సిన వేతనాలు రూ.26లక్షలు విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వేతనాల విడుదలకు కృషి చేశారని పేర్కొన్నారు. రెండు రోజుల్లో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి వేతనాలు చెల్లిస్తామని తెలిపారు.

నిమజ్జన వేడుకలు పరిశీలించిన డీసీపీ



నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నది వద్ద గణేష్ నిమజ్జనాన్ని మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి బుధవారం రాత్రి పరిశీలించారు. నదిలో నీళ్లు ఎక్కువగా ఉన్నందున ఎవరినీ వెళ్లనీయకుండా, క్రేన్ల సాయంతో విగ్రహాలు నిమజ్జనం చేసే తీరును పరిశీలించారు. సిబ్బందితోపాటు, ఇతర శాఖల వారికి, గజ ఈతగాళ్లకు పలు సూచనలు చేశారు. చిన్న చిన్న విగ్రహాలను వంతెన పైనుంచి, భారీ విగ్రహాలను వంతెన కింది నుంచి క్రేన్ల సాయంతో వేయాలన్నారు. లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై ప్రసాద్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో మల్లేశం, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఆర్సీవో స్వరూపారాణి

బెల్లంపల్లి: ప్రతీ ఒక్కరి సహకారంతో జోనల్ క్రీడలు దిగ్విజయం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి కోరారు. బుధవారం బెల్లంపల్లిలోని సీఓఈ గురుకులంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు జిల్లాల నుంచి 1200 మంది విద్యార్థులు పోటీలకు హాజరవుతారని అన్నారు. భోజన, వసతి సౌకర్యాలు మెరుగుపర్చాలని, పోటీలు వచ్చే నెల 13నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. అంతకుముందు క్రీడల నిర్వహణ, విజయవంతం కోసం పలు శాఖలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ రీజినల్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సట్ల శంకరయ్య, అధ్యాపకులు మహేశ్వర్‌రావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గుర్తింపు పోరుకు సై



గని కార్మికులు(ఫైల్)

- సింగరేణిలో కార్మిక ఎన్నికలకు లైన్‌క్లియర్
- వచ్చే నెల 28న రహస్య బ్యాలెట్‌తో పోలింగ్
- బొగ్గుగనులపై మొదలైన ఎన్నికల హడావుడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎట్టకేలకు సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్ వెలువడింది. వచ్చే నెల 28న రహస్య బ్యాలెట్ పద్ధతిన ఎన్నికల నిర్వహణకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. ఈ మేరకు బుధవారం రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు తేదీలు ప్రకటించారు. వాస్తవానికి ఈ నెల 22న షెడ్యూల్ విడుదల కావాల్సి ఉండగా.. హైకోర్టులో కేసు కారణంగా జాప్యం జరిగింది. చివరికి ముందుగా అనుకున్నట్లుగానే ఎన్నికలు జరగనున్నాయి. నాలుగేళ్లుగా గుర్తింపు ఎన్నికల ప్రక్రియకు జాప్యం జరుగుతుండగా.. కార్మిక నాయకుల పోరాటాలతో చిక్కులు తొలగిపోయాయి. దీంతో మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ కార్మిక క్షేత్రంలో గుర్తింపు సంఘం ఎన్నికల హడావుడి మొదలైంది. ఇప్పటికే గనులపై కార్మిక సంఘాలు ప్రచారం చేస్తున్నాయి. కాగా, గుర్తింపు సంఘ పదవీ కాలం 2019 అక్టోబర్‌లోనే ముగిసి నాలుగేళ్లు కావస్తోంది. ఇప్పటికి ఎన్నికల నిర్వహణలో ముందడుగు పడింది.



హైదరాబాద్‌లో కార్మిక సంఘాల నేతల చర్చలు

1998లో మొదలై..

1998లో తొలిసారి సింగరేణిలో కార్మిక ఎన్నికలు ప్రారంభం కాగా.. ఇప్పటివరకు జరిగిన ఐదు ఎన్నికల్లో ఏఐటీయూసీ మూడుసార్లు, ఐఎన్టీయూసీ ఒకసారి, టీబీజీకేఎస్ రెండుసార్లు విజయం సాధించాయి. తాజాగా మాజీ గుర్తింపు సంఘం హోదాలో టీబీజీకేఎస్ పోటీ పడుతుండగా, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, ఐఎఫ్‌టీయూ వంటి మరో 15 సంఘాల వరకు బరిలో ఉండనున్నాయి. 2019 దాకా నాలుగేళ్ల వ్యవధితోనే గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం కోర్టు తీర్పునకు అనుగుణంగా రెండేళ్ల కాలానికి ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- అక్టోబర్ 5న తుది ఓటరు జాబితా ప్రదర్శన
- 6నుంచి 7వరకు నామినేషన్ల స్వీకరణ
- 9వరకు ఉపసంహరణ గడువు
- 10న పరిశీలన, గుర్తుల కేటాయింపు
- 28న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్
- సాయంత్రం ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

అసెంబ్లీ ఎన్నికల ముందు..

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు జరుగనున్న ఈ కార్మిక పోరులో అధికార, విపక్ష రాజకీయ పార్టీలకు గెలుపోటములు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. అధికార బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) 2012, 2017 ఎన్నికల్లో రెండుసార్లు గెలిచింది. చివరిగా 2017అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో 23,848 ఓట్లతో 11 ఏరియాల్లో తొమ్మిది స్థానాలు గెలుచుకుంది. ఏఐటీయూసీ కూటమి 19,631 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. శ్రీరాంపూర్ డివిజన్‌లో 11,266 ఓట్లలో 6,189 ఓట్లు(54 శాతం) టీబీజీకేఎస్‌కు, 3,946 ఓట్లు(35 శాతం) ఏఐటీయూసీకి పోలయ్యాయి. అదే మందమర్రి డివిజన్‌లో 6,112 ఓట్లలో 3,946 ఓట్లు(53 శాతం) ఏఐటీయూసీ కూటమికి, టీజీబీకేఎస్‌కు 2,439 ఓట్లు(39.90 శాతం) వచ్చాయి. తక్కువ మంది కార్మికులున్న బెల్లంపల్లి డివిజన్‌లో టీబీజీకేఎస్‌కు 871 ఓట్లు (51.75 శాతం), ఏఐటీయూసీకి 675(40.10 శాతం) ఓట్లు లభించాయి. తాజాగా కాంగ్రెస్, బీజేపీ, సీపీఐలు తమ అనుబంధ కార్మిక సంఘాల గెలుపుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపాలని ప్రయత్నాలు చేస్తున్నాయి.

వీడ్కోలుకు వేళాయె..



గోదావరి నదిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్, పోలీసు అధికారులు

- గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం
- పోలీసుల భారీ బందోబస్తు
- మంచిర్యాల గోదావరి నదికి ఐదు ఫీట్ల లోపు ప్రతిమలు
- మిగిలినవి ఇందారం, రాయపట్నం నదికి..

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని గణేష్ ప్రతిమల నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. గురువారం నిమజ్జనం నిర్వహించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మంచిర్యాలలో గణేష్ విగ్రహాలను తరలించే క్రమంలో ముందుస్తుగా రహదారి పక్కన చెట్ల కొమ్మలు తొలగించారు. గుంతలు పూడ్చారు. విద్యుత్ దీపాల పనులు పూర్తి చేశారు. బుధవారం మంచిర్యాల గోదావరి నది వద్ద స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు పట్టణ సీఐ రాజు, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, తహసీల్దార్ భోజన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్ అంకం నరేశ్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పోలీసు అధికారులతో కలిసి మంచిర్యాలతోపాటు రాయపట్నం బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించారు. గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసులు పలు సూచనలు చేశారు. దండేపల్లి మండలం రాయపట్నం, జైపూర్ మండలం ఇందారం గోదావరి నది బ్రిడ్జి వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. పెద్ద వినాయకులను నదిలో నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్‌లు అందుబాటులో ఉంచారు. ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సేవలు వినియోగించుకోనున్నారు.

జాగ్రత్తలు పాటిద్దాం...

ఊరేగింపు నేపథ్యంలో అప్రమత్తత ఎంతో అవసరం. ట్రాఫిక్ ఆటంకం లేకుండా చూసుకోవాలి. వాహనాల ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సౌకర్యవంతంగా ఉంటుంది. రోడ్లపై జనసంచారం కలిగి ఉండడం వల్ల బాణాసంచా పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నపిల్లలను దూరంగా ఉంచితే మంచిది. ఊరేగింపు వాహనం కదిలేటప్పుడు బాణాసంచా కాల్చడాన్ని నివారించాలి. నదిలోపలికి వెళ్లి నిమజ్జనం చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. వెలుతురు ఉండగానే నిమజ్జనం చేస్తే ఇబ్బందులుండవు. లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేస్తే వేడుకను సంతోషంగా సురక్షితంగా ఆస్వాదించవచ్చు.

పోలీసు బందోబస్తు..

పట్టణంలో 245 విగ్రహాలకు గాను బుధవారం 30 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన విగ్రహాలు గురువారం గోదావరి నదిలో నిమజ్జనం చేయనున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా బారికేడ్లతోపాటు పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పర్యవేక్షణలో ఏసీపీ తిరుపతిరెడ్డి, ఐదుగురు సీఐలు, 9 మంది ఎస్సైలు, 150 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

ఇలా..

- గోదావరి నదిలో నిమజ్జనానికి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.
- మంచిర్యాల పట్టణంలోని గోదావరి నదిలో ఐదు ఫీట్లలోపు ఉన్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇచ్చారు.
- మారుతినగర్, ఏసీసీ, లక్ష్మీనగర్, హైటెక్‌సిటీకాలనీ, గౌతమినగర్, ఇస్లాంపుర, రాళ్లపేట్, ఇందిరానగర్, హనుమాన్‌నగర్, రెడ్డి కాలనీ వినాయక విగ్రహాలు వెంకటేశ్వర టాకీస్ మీదుగా ముఖరాం చౌరస్తా వరకు వెళ్లాలి. అక్కడి నుంచి పెద్ద విగ్రహాలు రాయపట్నం, ఇందారం గోదావరి నదికి తరలించాల్సి ఉంటుంది.
- హమాలీవాడ, సున్నంబట్టీ ప్రాంతాలకు చెందిన గణనాథులు నేరుగా ఇందారం గోదావరి నదికి తరలించాల్సి ఉంటుంది.
- గోదావరి రోడ్‌లోని కాలేజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన ఐదు ఫీట్ల కంటే ఎక్కువ ఉన్న విగ్రహాలు మంచిర్యాల గోదావరికి అనుమతి లేదు.
- మధ్యాహ్నం ఒంటి గంటలోపు వినాయకులు తీయాల్సి ఉంటుంది.

ఓటరు జాబితా రూపొందించాలి

- పరిశీలకులు అహ్మద్ నదీమ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కార్మిక శాఖ కమిషనర్, ఓటరు జాబితా పరిశీలకులు అహ్మద్ నదీమ్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్‌లతో కలిసి జూలై 15 నుంచి సెప్టెంబర్ 20 వరకు అందిన దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిష్కరించాలని సూచించారు. అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. కాల్ సెంటర్ 1950 నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కుమురంభీం జిల్లా రెవెన్యూ అధికారి జాడి రాజేశ్వర్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి దత్తు, ఎన్నికల తహసీల్దార్లు దేశ్‌పాండే శ్రీనివాస్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అహ్మద్ నదీమ్, కలెక్టర్ సంతోష్

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

- వారం రోజులు పారిశుధ్య పనులు
- చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

సాక్షి ఫోన్ ఇన్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో పారిశుధ్యం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, వారం రోజులపాటు ప్రత్యేక సిబ్బందితో అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చేపడుతామని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. పట్టణంలో పారిశుధ్య పనుల నిర్వహణ, దోమల నియంత్రణ కోసం ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు బుధవారం కమిషనర్ గంగాధర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజా సమస్యలను ఓపికగా విన్న ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: కుమ్మరిబొగుడ పాత ఇళ్లలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. పాములు వస్తున్నాయి.
– ఎస్.కె.రఫీక్ హైమద్, 18వ వార్డు

కమిషనర్: పాత ఇళ్లలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: అంబేద్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్యం లోపించింది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
– తగరం మధు, 7వ వార్డు

కమిషనర్: రెండు రోజుల్లో పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేయిస్తాం. కాలనీలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: ఎమ్మెల్యే కాలనీలో డ్రైనేజీలు లేని కారణంగా ఓపెన్ ప్లాట్లలో నీరు నిలిచి దోమలు వస్తున్నాయి. – గొలకొండ సాగర్, 8వ వార్డు

కమిషనర్: ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేయిస్తాం.



మాట్లాడుతున్న కమిషనర్ గంగాధర్

దోమల నివారణకు హైపోక్లోరైడ్ ద్రావణంతోపాటు ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: నాయీ బ్రాహ్మణవాడలో కల్వర్టు రోడ్డు కంటే ఒక అడుగు ఎత్తులో నిర్మించారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు సైతం సక్రమంగా లేవు. – తౌసిఫ్, 17వ వార్డు

కమిషనర్: రోడ్ల నిర్మాణానికి రూ.53 కోట్లు వచ్చాయి. రోడ్ల నిర్మాణంతోపాటు కల్వర్టు రోడ్డును సరిచేస్తాం.

ప్రశ్న: 15వ వార్డులో దోమలు విపరీతంగా పెరిగాయి. నివారణ చర్యలు చేపట్టండి. 5వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దోమలతో ఇంటిల్లిపాది జ్వరాల బారిన పడ్డాం.
– బాబ్లూ దోబా, 15వ వార్డు, మహ్మద్ హాజీ పాషా, 5వ వార్డు

కమిషనర్: వార్డుల్లో పర్యటిస్తా. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. డ్రైనేజీలు నిర్మించడంతోపాటు దోమల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతాం.

ప్రశ్న: బైపాస్ రోడ్డులో నివాస గృహాలను అనుకుని కాలువ ఉంది. కొత్తగూడెం డ్రైనేజీ నీరంతా కాలువ ద్వారా ఇళ్లను అనుకుని పారుతున్నాయి. – నెన్నెల నవీన్‌రాజ్, బైపాస్ రోడ్డు

కమిషనర్: సిబ్బందిని పంపించి కాలువ శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: మురికి కాలువలు సక్రమంగా లేవు. కాలువలు శుభ్రం చేయడం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయించండి. బొక్కలగూడెంలో బోరు వద్ద మురికి నీరు నిలుస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తచెదారం వేయడంతో కంపు కొడుతోంది. డ్రైనేజీలు సరిగా లేక మురికి నీరు రోడ్లపైకి వస్తున్నాయి. దోమలు చాలా పెరిగాయి.
– హజు, లైన్‌గడ్డ, కొంపల్లి బానేశ్, 3వ వార్డు, సాబాజ్, కాజీపూర

కమిషనర్: ముందుగా డ్రైనేజీలను శుభ్రం చేయిస్తాం. కాలనీలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తాం. రెండు రోజుల్లో వార్డుల్లో దోమల నివారణ చర్యలు చేడుతాం.

బ్రిక్స్ మాటున గంజాయి దందా



స్వాధీనం చేసుకున్న గంజాయితో సీపీ రెమా రాజేశ్వరి, పోలీసులు

- ఒడిశా టు మహారాష్ట్ర వయా మంచిర్యాల
- ట్రాక్టర్ టైర్ పంక్చర్‌తో గుట్టు రట్టు
- రూ.93లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

అభినందించిన సీపీ

గంజాయి తరలిస్తున్న నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ మోహన్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, శ్రీరాంపూర్ సీఐ రమేష్‌బాబును సీపీ అభినందించారు.

మంచిర్యాలక్రైం: ఒడిశా రాష్ట్రం నుంచి మంచిర్యాల మీదుగా మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు సిమెంటు బ్రిక్స్ మాటున గంజాయి దందా సాగుతోంది. ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఈ నెల 22న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సింగరేణి జీఎం కార్యాలయం వద్ద టైర్ పంక్చర్ కావడంతో గుట్టు రట్టయింది. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి బుధవారం శ్రీరాంపూర్ పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మాల్కన్‌గిరి జిల్లా బలిమేల ప్రాంతంలోని చిత్రకొండ గ్రామంలో గంజాయి సాగుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ నెల 22న ట్రాక్టర్‌లో సిమెంటు బ్రిక్స్ మాటున గంజాయి తరలిస్తుండగా శ్రీరాంపూర్ సింగరేణి జీఎం కార్యాలయం సమీపంలో రహదారిపై టైర్ పంక్చరైంది. నంబరు లేని ట్రాక్టర్ నిలిచి ఉండడాన్ని గమనించిన శ్రీరాంపూర్ సీఐ రమేష్‌బాబు 23న స్టేషన్‌కు తరలించారు. 25వరకు ఎవరూ రాకపోవడంతో అనుమానంతో పరిశీలించగా సిమెంటు ఇటుకల కింద 465కిలోల గంజాయి మూటలు లభించాయి. దీని విలువ సుమారు రూ.93లక్షలు ఉంటుంది.

నంబరు లేని ట్రాక్టర్ ఎక్కడిదని..

నంబరు లేని ట్రాక్టర్ ఎక్కడిదని, ఎక్కడి నుంచి ఇంత పెద్దమొత్తంలో గంజాయి ఎవరు రవాణా చేస్తున్నారనే కోణంలో పోలీసులు సాంకేతికతను ఉపయోగించి ట్రాక్టర్ ఆచూకీ కనుగొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లాలోని చీతాపరి గ్రామానికి చెందిన చిత్రసేన్ క్రిసానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. చిత్రసేన్‌తోపాటు అతడి సోదరుడు జగబందు క్రిసానిను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. ఈశ్వర్, గురు క్రిసాని ఈ దందాలో ఉన్నట్లు తేలింది. చిత్రసేన్, జగబందులను అరెస్టు చేయగా.. ఈశ్వర్, గురు పరారీలో ఉన్నారు.

వెయ్యి కిలోమీటర్లకు పైగా దూరం..

ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా నుంచి వయా మంచిర్యాల మీదుగా మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు సుమారు వెయ్యి కిలోమీటర్ల పైగానే దూరం ఉంటుంది. ఇలా గతంలోనూ తరలించారు. గురు, ఈశ్వర్‌లు సిమెంటు బ్రిక్స్ మాటున గంజాయి తరలించేందుకు చిత్రసేన్ వద్ద ట్రాక్టర్ అద్దెకు తీసుకున్నారు. గురు క్రిసాని(ట్రాక్టర్ డ్రైవర్), ఈశ్వర్‌లు ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి తరలిస్తుండగా శ్రీరాంపూర్ వద్ద ట్రాక్టర్ పంక్చరైంది. ఈ ప్రాంతం కొత్త కావడం, పైగా రాత్రి కావడంతో వదిలేసి వెళ్లి ట్రాక్టర్ యజమాని చిత్రసేన్‌కు తెలియజేశారు.

పెట్రోల్ బంకు బిల్లుతో గుర్తింపు..

పోలీసులు ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఒడిశా రాష్ట్రంలోని ఓ పెట్రల్ బంకులో డీజిల్ పోయించిన బిల్లు, ఆధార్‌కార్డ్ ఆధారంగా గుర్తించారు. దీని ఆధారంగా గంజాయి దందా గుట్టు రట్టు చేశారు. గంజాయి, ట్రాక్టర్ సీజ్ చేసి చిత్రసేన్, జగబందులను రిమాండ్‌కు తరలించారు.

ఓటు హక్కు.. ఆకట్టుకునేలా పాట

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటు హక్కు ప్రాముఖ్యతపై జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ రాసిన పాట యువతను ఆకట్టుకుంటోంది. ''రండి రండి దండేపల్లి అన్నల్లారా.. ఓటేద్దాం బెల్లంపల్లి తమ్ముల్లారా..'' అంటూ సాగుతుంది. కలెక్టర్ సంతోష్ డ్రైవర్ రాజన్న ఈ పాటను ఆలపించగా, ఆయన బృందం సంగీతం అందించారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవ సందర్భంగా రాహుల్ ఓ కవిత రచించి, వినిపించిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

గణేశ్ మండపంలో చోరీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండలి వద్ద మంగళవారం రాత్రి హుండీని గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. మండపంలో రాత్రి వ్యక్తి కాపలాగా ఉన్నప్పటికీ గోడ పైనుంచి లోనికి ప్రవేశించిన వ్యక్తి హుండీని ఎత్తుకెళ్లాడు. సీసీ ఫుటేజీలో చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వాసవి మందిర్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీంతో పాటు పట్టణంలోని మరో రెండు గణేశ్ మంటపాల వద్ద హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

మహిళ ఆత్మహత్య


రాజేశ్వరి(ఫైల్)

భీమారం: ఒంటరితనం భరించలేక పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పోలంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ వివరాల ప్రకారం... మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన జానంపల్లి రాజేశ్వరి(40) తల్లిగారింట్లో ఉంటూ ఒంటరిగా జీవిస్తోంది. దీంతో ఒంటరితనం భరించలేక ఈనెల 25 ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుంటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పుస్తెల తాడు చోరీ

భీమారం: మండల కేంద్రంలోని పోటువాడకి చెందిన కొత్తపల్లి పోసక్క మెడపై ఉన్న మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడును బుధవారం గుర్తు తెలియని అగంతకుడు ఎత్తికెళ్లాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. పోసక్క ఇంట్లో ఉన్న సమయంలో మోటారు బైక్‌పై వచ్చిన అగంతకుడు ఇంట్లోకి చొరబడి గ్యాస్‌స్టవ్ రిపేరు చేస్తానని చెప్పడంతో వద్దని చెప్పి తలుపులు వేసే ప్రయత్నం చేసింది. అగంతకుడు మాత్రం బలవంతంగా ఇంట్లోకి వెళ్లి గ్యాస్‌స్టవ్ బాగు చేస్తానని ఒక్కసారిగా పోసక్కపై దాడి చేసి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపుకొని బైక్‌పై పారిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

30న కస్టోడియల్ డెత్‌పై విచారణ

మంచిర్యాలఅగ్రికల్చర్: బెల్లంపల్లి–2 పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్లంపల్లి పట్టణానికి చెందిన కీర్తి అంజి కస్టోడియల్ డెత్‌పై ఈ నెల 30న ఉదయం 11 గంటలకు జిల్లాలోని సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ మంచిర్యాల ఆర్డీవో అధికారి కార్యాలయంలో న్యాయాధికారి విచారణ నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాములు ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

దాడి కేసులో ముగ్గురికి జరిమానా


కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో వ్యక్తిగత కక్షలతో దాడిచేసిన ఘటనలో బుధవారం మంచిర్యాల అడిషనల్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్ జడ్జి ఆర్పిత మారంరెడ్డి ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున ముగ్గురికి జరిమానా విధించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలోని ముత్యంపల్లికి చెందిన బోయిని మల్లేష్, అతడి కుమారుడు నగేష్, సోదరి లక్ష్మిలను 8 జూన్ 2017లో వ్యకిగత కక్షలు, పొలం గట్టు గొడవల కారణంగా తీవ్రంగా దూషించడంతో పాటు దాడిచేసి గాయపరచిన కేసులో అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేయగా సాక్షులను విచారించిన జడ్జి బోయిని హన్మంతు, బోయిని అంకులు, బోయిని రామక్కలకు జరిమానా విధించినట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో మూడేళ్ల జైలు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్వరి చర్చ్‌కి వచ్చిన మైనర్‌ను కిడ్నాప్ చేసిన కేసులో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన పెగడపల్లి వెంకటేష్‌కు మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా బుధవారం మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్స్ జడ్జి ఆర్పిత మారం రెడ్డి విధించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. 2016 అక్టోబర్ 30న నమోదైన కేసు ప్రకారం హైదరాబాద్ గాజుల రామారంకు చెందిన జెమాల్‌పూర్ అమర్‌నాథ్ కూతురు సోమగూడెం కల్వరి చర్చ్‌కి వచ్చింది. అక్కడి నుంచి కనిపించకుండ పోయినట్లు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన అప్పటి ఎస్సై సతీష్ నిందితుడు వెంకటేష్‌పై కోర్టులో అందించాడు. సాక్షులను విచారించి పూర్తివిచారణ అనంతరం జడ్జి పైవిధంగా శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

గన్నీ సంచులు గోల్‌మాల్





శివ్వారం, అరెపల్లి కేంద్రాల నుంచి గోదాంకు గన్నీ బ్యాగులు తరలించినట్లు నమోదు చేసిన ట్రాక్‌షీట్

- ఆ రెండు కేంద్రాల నుంచే అధికం
- 12 వేల సంచులు గోదాంకు రాకున్న వచ్చినట్లు...?
- విచారణ చేపడితే అక్రమాలు బయటకు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్ని ఆరోపణలు, ఎన్ని సరెండర్లు చేసిన తాను తలుచుకున్నది జరుగాల్సిందే.. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపించడమే గోపాలుని లీలలు. గన్ని సంచులైన, లారీ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలైన, మిల్లుకు లారీపోవాలన్న, గోదాం నుంచి ధాన్యం కదులాలన్న.. తన చేతి వాటం ఉండాల్సిందే మరి.. జిల్లాలో గడిచిన యాసంగి ధాన్యం సేకరణ సమయంలో కొనుగోలు కేంద్రాలకు అందజేసిన గన్నీ సంచులు మిగిలిన, చినిగినవి, గోదాంకు తరలింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. కేవలం రెండు కొనుగోలు కేంద్రాల నుంచి 12 వేల గన్ని సంచులు గోదాంకు తరలినట్లు ట్రాక్‌షీట్లలో నమోదు చేశారు. కేంద్రం నుంచి తరలించే లారీ నెంబర్, డ్రైవర్ నెంబర్ ఏదీ లేకుండా ట్రాక్‌షీట్‌లో ఎంట్రీ చేయడం పలు అనుమానలకు తావిస్తుంది. బహిరంగ మార్కెట్లో రూ.3.50 నుంచి రూ.4లక్షల విలువ గల 12వేల గన్ని సంచులు గాయబ్ అయినట్లు తెలుస్తోంది. లింగపూర్ గోదాంలో గత యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు తరలించిన గన్నీ సంచులు, నిల్వ ఉన్న గన్ని సంచులు, సీజన్ ముగింపుతో కేంద్రాల నుంచి తిరిగి వచ్చిన గన్నీ సంచులు ఎన్ని ఉన్నాయనే దానిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గత సీజన్‌లో 54లక్షల గన్నీ బ్యాగులు..

గత యాసంగి సీజన్‌కు సంబంధించి 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. దీనికి సంబందించి 54,10,683 గన్ని బ్యాగులు దండేపల్లి మండలం లింగపూర్, కోటపల్లి గోదాములలో అందుబాటులో 46 శాతం 54 శాతం గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు తరలించారు. పాత వాటికి టెండర్ల తెప్పించి సరఫరా చేయగా కొత్తవి ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించారు. ధాన్యం సేకరణ నిర్వహకులకు అందజేసిన వాటిలో 100 గన్ని బ్యాగులకు 6 వరకు డ్యామేజి రిప్లెస్‌మెంట్‌కు అవకాశం ఉంది. మిగిలిన, తిరిగి గోదాం (ఎంఎల్ఎస్) పాయింట్‌లో అందజేసి ట్రాక్‌షీట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తిరిగి ఇవ్వని సెంటర్లకు ధాన్యం సేకరణ కమీషన్లో ఒక్కొ గన్నీ చొప్పున కోత పెడుతున్నారు. ఒక్కో లాట్‌లో వేల గన్నీ సంచులు ఉండడం ధాన్యం సేకరణ సమయంలో లాట్‌లో చిరిగి గన్ని బ్యాగులు పెద్దమొత్తంలో వచ్చాయని కొత్తవి ఇవ్వాలని పలుమార్లు నిర్వహకులు ఆందోళన చేపట్టారు. వాటిని తీసుకునేందుకు పౌరసరఫరాల అధికారులు నిరకారిస్తున్నారని కలెక్టరేట్‌కు వచ్చి సైతం ఆందోళన చేపట్టారు. కొన్ని కేంద్రాల్లో రిప్లెస్ మెంట్‌కు వేల గన్ని సంచులు గోదాములకు వచ్చినట్లు రికార్డుల్లోకి ఎక్కుతున్నాయి.

రెండు కేంద్రాల నుంచే అధికంగా..

గత యాసంగి సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న గన్నీ బ్యాగులు తరలింపు లెక్కలు గత నెలతో పూర్తి చేశారు. సదరు అధికారి గోదాంలో తనిఖీ చేపట్టగా అప్పటికే గన్నీ బ్యాగుల నిల్వలు ఉండడంతో వాటి స్థానంలో కేంద్రాల నుంచి వచ్చే గన్నీ బ్యాగులను పక్కదారి పట్టించేందుకు పన్నాగం పన్నాడు. జైపూర్ మండలం వేలాల పిఏసీఎస్ కొనుగోలు కేంద్రం నుంచి వినియోగంలోకి వచ్చే గన్నీ సంచులు 4000, మరో 2000 గన్ని సంచులు చిరిగినవి, భీమారం మండలం ఆరెపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నుంచి వినియోగంలోకి వచ్చే 4500 గన్ని బ్యాగులు మరో 1500 గన్ని బ్యాగులను లింగపూర్ గన్నీ బ్యాగుల గోదాంకు తరలించినట్లు ట్రాక్‌షీట్‌లో నమోదు చేశారు. బహిరంగ మార్కెట్లో ఒక్కొ గన్ని బ్యాగు రూ.30 నుంచి రూ.35 ఉంటుంది. ఈ లెక్కన రూ.3.50 లక్షల నుంచి రూ.4లక్షల వరకు అక్రమాల గన్నీ సంచినిండినట్లు తెలుస్తోంది. గోదాంకు రాకున్న గన్ని బ్యాగులు వచ్చినట్లు ట్రాక్‌షీట్‌లో గోదాం ఇన్‌చార్జి సంతకం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆధార్ అవస్థలు.. అప్‌డేట్‌కు తిప్పలు


ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకులో క్యూకట్టిన జనం

- ఆధార్ కేంద్రం వద్ద జనం బారులు...


ఆధార్ ఫాం నింపేందుకు అవస్థలు...

దండేపల్లి: రేషన్‌కార్డుకు, ఈకేవైసీ అనుసంధానం తప్పనిసరి కావడంతో రేషన్ కార్డులో పేర్లు ఉన్న వారందరూ రేషన్ దుకాణానికి వెళ్లి, ఈపాస్ యంత్రంపై వేలిముద్రలు వేస్తే ఈకేవైసీ పూర్తవుతుంది. ఈకేవైసీ కావాలంటే ప్రతీ ఒక్కరి ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కావడంతో పాటు ఆధార్ అప్‌డేట్ అయి ఉండాలి. ఆధార్ అప్‌డేట్ కానీవారికి ఫోన్ నంబర్ లింకు లేనివారి వేలిముద్రలు ఈపాస్ యంత్రంలో పడటం లేదు. దీంతో ఫోన్ నంబర్‌లింక్ లేనివారు, ఆధార్ అప్‌డేట్ కాకా వేలి ముద్రలు పడని వారంతా, అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చాలా మంది పిల్లల ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు రావడంతో ఆధార్ కేంద్రాలు జనాలతో కిటకిటలాడుతున్నాయి. దండేపల్లి మండలానికి అంతటికి కలిపి దండేపల్లి గ్రామీణా బ్యాంకులో ఆధార్ కేంద్రం ఉంది. దీంతో బ్యాంకు ఖాతాదారులతో పాటు, ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం జనాలు బ్యాంకు రావడంతో, బ్యాంకు జనాలతో కిక్కిరిసి కనిపిస్తుంది.

ఆధార్ ఫాం నింపడం పరీక్షే..

ఆధార్ నమోదు, అప్‌డేట్ చేసుకోవాలంటే ఫాం నింపాల్సి ఉంటుంది. దీంతో అది నింపడం రాని కొందరూ, చాలా ఇబ్బంది పడుతున్నారు. ఫాం నింపడం, తెలియక కొంతమందికి పరీక్షే అవుతుంది. ఆధార్ కేంద్రం వెలుపల కూర్చుని, ఆధార్ ఫాం నింపేందుకు, ఒకరు నింపిన దానిని చూసి, ఇంకొకరూ నింపుతూ ఇబ్బందులు పడుతున్నారు.

రోజుకు 30 నుంచి 40వరకు మాత్రమే..

ఆధార్ అప్‌డేట్ కోసం వందల మంది వచ్చి దరఖాస్తులు ఇస్తున్నప్పటికీ, రోజుకు 30 నుంచి 40 వరకు మాత్రమే అప్‌డేట్ అవుతున్నాయి. దీంతో పలువురు రోజంతా నిరీక్షించి వెనుదిరిగి వెళ్తు, మరుసటి రోజు రావల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొందరయితే బడికి వెళ్లిన పిల్లలను, హాస్టల్‌లో ఉన్నవారిని ఇంటికి తీసుకువచ్చి ఒక్కరోజులో పని అయిపోతుందనుకుంటే, కావడం లేదు. ఒక్కొక్కరూ, రెండు, మూడు రోజులు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బొగ్గుగనుల్లో సమ్మె వాయిదా

శ్రీరాంపూర్: దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో అక్టోబర్ 5, 6, 7 తేదీల్లో చేపట్టిన సమ్మెను అక్టోబర్ 12, 13, 14 తేదీలకు వాయిదా వేస్తున్నట్లు జాతీయ సంఘాల నాయకులు ప్రకటించారు. 11వ వేతన ఒప్పందంతో ఉద్యోగుల కొత్త వేతనాలు తమ కంటే అధికంగా పెరిగాయని, ఇది డీపీఈ గైడ్‌లైన్స్‌కు విరుద్ధమంటూ అధికారులు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు స్పందించి కొత్త వేతనాలు కాకుండా పాత వేతనాలు అమలు చేయాలని ఆదేశాలిచ్చిందని జాతీయ సంఘాల నేతలు తెలిపారు. ఈ ఆదేశాలు అమలు చేయకుండా న్యాయపరంగా ఎదుర్కొని ఉద్యోగులకు పెరిగిన వేతనాలు ఇవ్వాలని కోరుతూ దేశ వ్యాప్తంగా సమ్మెకు ఏఐటీయూసీ, బీఎంఎస్, ఐఎన్టీయూసీ, హెచ్ఎమ్మెస్, సీఐటీయూలు పిలుపునిచ్చాయి. దీనిపై బుధవారం న్యూఢిల్లీలో జాతీయ సంఘాల నేతలతో కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్ చర్చలు జరిపారు. దీనిపై న్యాయపరమైన అవరోధాలు అధిగమించి, భారత ప్రభుత్వంతో నుంచి వేతన ఒప్పందానికి పూర్తి అనుమతి పొందేలా కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. దీంతో వారి అభ్యర్థన మేరకు కొంత గడువు ఇవ్వడం జరిగిందని, ఈలోగా పరిష్కారం చేయకుంటే అక్టోబర్ 12,13,14 తేదిల్లో సమ్మె చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నరసింహరావు, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ తెలిపారు.

లాభాల వాటాపై సంబరాలు

శ్రీరాంపూర్: కార్మికులకు 32శాతం లాభాల వాటను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై గుర్తింపు సంఘం నాయకులు సంబరాలు నిర్వహించారు. బుధవారం ఆర్కే 6 గనిపై టీబీజీకేఎస్ నాయకులు టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటూ కోరిందల్లా ఇస్తున్నారన్నారు. లాభాల వాటను గణనీయంగా పెంచుతూ వస్తూ ఇప్పుడు ఏకంగా 32శాతం వాటాను ఇవ్వడం కార్మిక లోకం హర్షించదగిందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, నాయకులు పొగాకు రమేష్, లక్ష్మీనారాయణ, మొగిలి, తోడ బాపు, రెడ్యా నాయక్, కిషోర్, సదానందం, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


టపాసులు కాల్చుతున్న టీబీజీకేఎస్ నేతలు

సింగరేణిలో కోడ్‌ఆఫ్ డిసిప్లేన్‌ను మార్చాలి

పాతమంచిర్యాల: సింగరేణి సంస్థలో కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అనే నల్ల చట్టాలను మార్చాలని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య, కో కన్వీనర్ నీరటి రాజన్న అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికల కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉండాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అన్ని రిజిస్టర్డ్ సంఘాలతో కార్మికుల హక్కుల కోసం చర్చించి గెలిచిన సంఘాలతో అగ్రిమెంట్‌లు చేసుకోవాలన్నారు. డిస్మిస్ కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు జైపాల్‌సింగ్, దేవిసత్యం, దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు, సంఘాల నాయకులు

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి


జ్యోతి (ఫైల్)

రెబ్బెన: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన ముల్కల జ్యోతి (28) మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. జ్యోతి ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ కేబుల్ ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డు పైనుంచి వెళ్తుంది. అయితే సర్వీస్ వైర్ ఇన్సులేషన్ ఫెయిలై వైర్ తెగి రేకుల షెడ్డుకు తగులుతోంది. ఈ క్రమంలో జ్యోతి బట్టలను షెడ్డుకు కట్టిన వైరుపై ఆరేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ట్రాన్స్‌కో ఏఈ ఇమ్రాన్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సంఘటన స్థలం పరిశీలిస్తున్న సీఐ, విద్యుత్ ఏఈ

దాడికి పాల్పడిన న్యాయవాదికి జరిమానా

మంచిర్యాలక్రైం: కోర్టు ప్రాంగణంలో కొట్టి గాయపరిచిన న్యాయవాదికి రూ.5వేల జరిమానా విదిస్తు ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ బుధవారం తీర్పునిచ్చారు. కోర్టులైసన్ ఆఫీసర్ వివరాల ప్రకారం.. రామగిరి శ్రీపతి అనే వ్యక్తికి మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్త సత్తయ్య రూ.5లక్షలు ఇచ్చేది ఉంది. దీంతో సత్తయ్య ఆఫీసుకు రావాలని శ్రీపతికి చెప్పాడు. దీంతో అతడు మరో ఇద్దరిని తీసుకొని అతడి ఆఫీసుకు వెళ్లాడు. దీంతో శ్రీపతితో పాటు అతడితో వచ్చిన మరో ఇద్దరిని కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో 2020 జూలై 30న ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై రాజమౌళిగౌడ్ కేసు నమోదు చేసి ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణలో భాగంగా 9మంది సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా తీర్పు వెలువరిచింది.

వ్యాసరచన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండోస్థానం


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

జన్నారం: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలలో కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించారు. పాఠశాలకు చెందిన విజయ్, అక్షయ్, సందేశ్‌లు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాయగా వారు రెండోస్థానంలో ఎంపికై ఒక్కొక్కరూ రూ.10వేల నగదు బహుమతి గెలుచుకున్నట్లు హెచ్ఎం గుండ రాజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు గోవర్దన్, రాజన్నలను ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

కవితను కలిసిన టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల్లో నుంచి 32శాతం వాటా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులు ఆ యూనియన్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో టీబీజీకేఎస్ సెంట్రల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యతో పాటు పలువురు నాయకులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు డి. అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, శ్రీరాంపూర్ టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గడ్డం మహిపాల్‌రెడ్డి, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగులు..


పుష్పగుచ్ఛం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు బుధవారం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. ఆమె నివాసంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేఆర్సీరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, ఉపాధ్యక్షులు ఏ.వేణుమాధవులతోపాటు అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జే.వి.దత్తాత్రేయులు కలిసి పలు సమస్యలపై వేర్వేరుగా వినతిపత్రం అందించారు.

క్రీడానైపుణ్యాలతో సింగరేణి ఖ్యాతి పెంచాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ

రెబ్బెన(ఆసిఫాబాద్): సంస్థలో పనిచేసే క్రీడాకారులు మెరుగైన క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి ప్రఖ్యాతిని పెంచాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం 90వ వార్షిక క్రీడలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేసే క్రీడాకారులకు యాజమాన్యం అన్ని రకాల వసతులు, సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. క్రీడాకారులందరూ నిరంతర సాధనతో తమలోని క్రీడలను మెరుగుపర్చుకోవాలని అన్నారు. ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం ఉజ్వల్‌కుమార్, డీవైపీఎం తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు ఉన్నారు.

రోడ్డు బాగుచేసుకున్నారు..


ఎడ్లబండ్లతో మట్టిని తెచ్చి రోడ్డును బాగు చేసుకుంటున్న గ్రామస్తులు

వేమనపల్లి: మండలంలోని కొత్త జాజులపేట గ్రామస్తులు ఎడ్లబండ్ల సాయంతో మట్టిని తీసుకొచ్చి రోడ్డును బాగు చేసుకున్నారు. గ్రామం ఏర్పడి 30 ఏళ్లు అవుతున్నప్పటికీ ఆ గ్రామానికి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి అరకిలోమీటర్ దూరం వరకు రోడ్డు లేదు. ఈ విషయమై కలెక్టర్, ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదు. దీంతో కుల వివక్ష నిర్మూలన సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎడ్లబండ్లతో కదిలి మట్టి రోడ్డు వేసుకున్నారు.

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆత్మహత్యాయత్నం

లక్సెట్టిపేట: ఇంటి నిర్మాణం కోసం తహసీల్దార్ కార్యాలయం నుంచి నాళా అనుమతి ఇవ్వడం లేదని ఓ వ్యక్తి కుటుంబంతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... కార్తీక్‌కు తండ్రి నుంచి సర్వే నంబర్ 8/5/1లో రెండెకరాల భూమి వచ్చింది. అందులోని రెండు గుంటల తొమ్మిది పైసల భూమిలో ఇల్లు నిర్మించుకునేందుకు రెవెన్యూ నుంచి అనుమతి కావాలని తహసీల్దార్ కార్యాలయంలో నాళా కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నాలుగేళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. మరికొందరు రెవెన్యూ అధికారులు లంచం డిమాండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కానిగంటి కార్తీక్, తల్లి వెంకటలక్ష్మి, చెల్లెలు నవ్యశ్రీ ముగ్గురు బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన సిబ్బంది వారిని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై లక్ష్మణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడి శాంతిపజేశారు. తహసీల్దార్ రాఘవేంద్రరావును వివరణ కోరగా ఇటీవల తాను బదిలీపై వచ్చానని, దరఖాస్తును పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు లేకుంటే వెంటనే నాళా అనుమతిని ఇప్పిస్తామని తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్